# డాల్స్ ఎండ్ ఫాల్స్

అవసరాల రామకృష్ణారావు



చూసిన సినిమా కబుర్లు పెద్ద గొంతుకలతో సరదాగా చెప్పుకుంటూ మేటనీ నుంచి ఇంటిదారి పట్టారు రజనీ, మాధవీ. వాళ్ళనలా చూస్తుంటే ఫ్రెండ్సనుకుంటారు గానీ వదినా మరదళ్ళని ఎవరూ అనుకోరు. రజని కాపరానికి వచ్చి మూడేళ్ళయింది. మాధవికి పెళ్ళయి ఆర్నెల్లే అయింది. వాళ్ళాయన పనిచేస్తున్న ఊరికి అక్కణ్ణుంచి మహా అయితే గంట ప్రయాణం. మాధవిని ఎప్పుడుపడితే అప్పుడు అన్న శంకరం ఇంటికి పంపే సహృదయుడు, ఆమె భర్త గోపి. సంక్రాంతి ఇంకా పది రోజులుందనగానే ఈసారి పెళ్ళాన్ని వాళ్ళ ఊరికి దిగబెట్టేడు. తీరా పండుగ నాటికే అనుకుంటే గోపీ చెల్లెల్నీ బావగార్నీ ఆ వేళకి పిలవాలి మరి. అయితే రజనీ, మాధవీ చెప్పుకునే కారణం వేరు. 'పెద్ద పండుగ ధర్మమా అని ఈ సారి ఏకంగా నాలుగు భారీ సినిమాలు ఓ వారం అటూ ఇటూగా విడుదల అవుతున్నాయి. ముందు నుంచీ ఒకటి ఒకటి చూసుకోకపోతే పండుగ రద్దీలో వాటినన్నిటినీ కవర్ చెయ్యాలంటే మాటలా!' అనేది వారి ఆవేదన. అందుకే గంట ముందుగా క్యూలో నిలబడి టిక్కెట్లు సంపాదించి ఆనాటి 'మేటనీ మొక్కు' చెల్లించుకుని సగర్వంగా ఇంటికొస్తున్నారు. దార్లో ఎవరో పిలిచినట్టై వెనక్కి చూశారు. చిన్నపిల్ల ఒకర్తె కళ్ళూ ఒళ్ళూ తిప్పుకుంటూ వాళ్ళని అటకాయించింది. "మా అమ్మ మీ ఇద్దర్నీ ఓసారి మా ఇంటికి రమ్మంటోంది. కిందటేడు మీ ఇంట్లో బొమ్మల కొలువు ఎంతో బాగా పెట్టేరుగా! ఈసారి నేనూ పెట్టుకుంటున్నాను, ఓసారి మా ఇంటికొచ్చి ఎలా పేర్చాలో కాస్త చెప్పండి. ఈ పక్క సందులోనే. ఒక్క అరగంట ఉంటే చాలు.. ప్లీజ్!"

రజనీ, మాధవీ ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. ఇంటి తాళాల ఓ సెట్టు రజని దగ్గర ఎప్పుడూ ఉంటుంది. శంకరం దగ్గర ఇంకోటి ఉండబట్టే అతను వీళ్ళ ప్రసక్తి లేకుండా ఆఫీసు నుంచి మధ్యాహ్నం ఇంటికి భోజనానికి వచ్చి, తను మట్టుకు తను పెట్టుకు తినేసి, అంట్లు సింకులో పారేసి, ఇంటికి తాళం వేసుకుని ఆఫీసుకి వెళ్ళిపోయి ఉంటాడు. మరిప్పుడు ఇద్దరూ వెళ్ళిపోతే రెండోపూట దాసీది వచ్చే వేళయిందే, ఎలా? 'నువ్వెళ్ళు మాధవీ.. నే తర్వాత రేపో ఎల్లుండో వస్తానని ఆంటీకి చెప్పు' అంటూ రజని ఒక్కర్తీ ఇంటికొచ్చేసింది.

ఇంటికి చేరాక వంటింట్లో పని చకచకా చక్కబెట్టేసుకుంది రజని. నాలుగేళ్ళపాటయినా పిల్లలు వద్దనుకుని జాగ్రత్తపడుతున్నారు గనక, ఆ బాధ లేదు. సాధించే పెద్దలూ లేరు. ఆధునిక వంట పరికరాలన్నీ ఎప్పటికప్పుడు అమర్చే భర్త. ఇంతకన్నా సుఖం ఇంకెక్కడుంది! 'నే వచ్చేసరికి బాగా ఆలశ్యమౌతుంది. మీరు తినెయ్యండి' అంటూ శంకరం ఫోను చేశాడు కూడా. మాధవి రాగానే ఇద్దరూ, భోజనాలు కూడా ముగించేసుకుంటే కొత్త టీవీ సీరియల్‌కి ఎంచక్కా మొదట్నుంచీ ఎటెండ్ కావచ్చు. మొదట్నుంచీ చూడని బతుకెందుకు!

ఇంకా మాధవి రాలేదేమిటా అని అటూ ఇటూ తిరుగుతున్న రజనికి శంకరం ఆఫీసు ఫైల్సు ఇంటికి తెచ్చుకుని అప్పుడప్పుడూ పని చేసుకునే వర్కింగ్ టేబుల్ ఆకర్షించింది. దాని డ్రాయరుకి కొత్తగా తాళం వేసి ఉండడం ఆమె ఆసక్తిని పెంచింది. అయితే ఆ పక్కనే ఉన్న చిన్న తాళం చెవి ఆ రహస్యమేదో నన్ను ఉపయోగించి తెలుసుకోరాదూ!' అని తన చెవిలో చెప్పినట్టయింది. వెంటనే తాళం తీసి డ్రాయరు ఇవతలికి లాగింది. అందులో కనపడిన వస్తువు చూసి ఆమె నోట మాట రాలేదు. నీటుగా పేక్ చెయ్యబడిన ఖరీదైన చీర అది. ఇలా చేత్తో పట్టుకుంటే జర్రున జారిపోతోంది. ఆడపుట్టుక పుట్టేక ఇలా ఓసారి చూస్తే గిర్రున కన్ను తిరిగిపోతోంది. ఒంటిమీద నిలబడనిది, ఎదుట ఆడది కట్టుకుంటే కంటిమీద కునుకు కుదరనిది, చిన్నచిన్న ముచ్చటైన హంసల అంచుగా రూపుదిద్దుకున్నది. ఇక పమిటంచు చూడబోతే బంగారు నీటిలో ముంచి తీసినట్టున్న జిగజిగలు కలది, ఏ పదివేలో చేసే వెంకటగిరి లేత గులాబీరంగు చీర. ఎంతో కష్టపడి ఉన్నదున్నట్టు మడతపెట్టి కవరులో పెట్టి ఎప్పట్లా తాళం వేసేసింది రజని. అలా చేస్తూ ఆ మాట అనుకుంటూ త్రుళ్ళిపడింది ఆమె.

ఎప్పట్లా మొగుడికి తాళం వెయ్యడానికి తన ఖర్మ ఏం కాలిందని! ఎప్పట్నుంచో అడుగుతోంది, తన మొహాన్నో మంచి చీర తగలెయ్యమని. పెద్ద పండుక్కేనా ఓ శుభ్రమైన, పెళ్ళాం మనసుపడిన చీర కొనలేని మగడు వాడూ మొగాడేనా! ఎంతసేపూ తన బతుకు టీవీల్లో సినిమాల్లో పాత్రలు మాటిమాటికీ మార్చే చీరలు చూసి లొట్టలు వెయ్యడానికేనా! పెళ్ళాం శరీరం మీద పరాక్రమించడమే హక్కు అనుకునే భర్తకి, ఆ శరీరం అందాన్ని పదింతలు చేసేలా ఆక్రమించే కోరిన చీర అందించే కనీస బాధ్యత లేదా! ఎన్నిసార్లు అడిగినా 'ఇంకా నా ఉద్యోగం కన్‌ఫర్మ్ కాలేదు, ఇంక్రిమెంటు శాంక్షన్ కాలేదు. నాలుగు రోజులు ఓపిక పట్టు' అని ఎప్పటికప్పుడు కప్పదాట్లు వేసే తన భర్తకి ఇప్పటికిప్పుడు ఇంత మంచి చీర కొని తేడానికి డబ్బులెక్కడి నుంచి వచ్చినట్టు! ఇంతకీ ఇదెవరికోసం?

జవాబు ఊహించినకొద్దీ రజనికి చిర్రెత్తుకొచ్చింది.

"ఇంకెవరికి, స్పష్టంగా తెలుస్తూనే ఉంది, ముద్దుల చెల్లెలికి. కట్టుకున్నది ఏ గంగలో కలిస్తేనేం! అది రక్తసంబంధం మరి. వాళ్ళ పెద్ద మేనత్త ఆ ఊర్నించి వెళిపోతుందంటే ముందు రోజు అన్నా చెల్లెలూ స్టేషనుకెళ్ళి వచ్చారు. అప్పుడు చేసుకొచ్చిన నిర్వాకం అన్నమాట ఇది. రెండ్రోజుల్లో ఎలాగా అత్తారింటికి వెళ్ళిపోతుందిగా, అప్పుడు సాగనంపుతూ చాటుగా ఇది అందిస్తాడన్నమాట. ఏ దుర్మార్గమూ కాకపోతే డ్రాయర్లో పెట్టుకుని తాళం వేసుకోడం దేనికీ! పైకలా నంగనాచిలా కబుర్లు చెబుతోంది, ఈ మాధవి ఎంతటి మోసగత్తె. వదిన మొహానికి వెయ్యి రూపాయల గుడ్డయినా ఎక్కువే, తన వయ్యారానికి మాత్రం పదివేల ఖరీదైన చీర అక్కడ పెట్టవలసిందే! ఆడపడుచా! అర్ధమొగుడా!

రజనికి ఈ సమస్య ఎలా పరిష్కరించడమో తోచలేదు. అన్నీ కలిపి తన చాతకానితనంగా తోచి కన్నీటితో చెంపలు తడిసిపోయాయి. కాలింగ్ బెల్ వినపడడంతో చెంగుతో మొహం తుడుచుకుని లేచి తలుపు తీసింది. ఈసారి మాధవితోపాటు పిన్నిగారి చుట్టమెవడో కూడా వచ్చాడు. "సారీ వదినా ఆలశ్యమైపోయింది. వాళ్ళు నన్నోపట్టాన వదిల్తేనా. వంటా అదీ నువ్వొక్కర్తివే చేసేసుకున్నావో ఏమో! అన్నయ్య ఏడీ?" అంది మాధవి.

"లేటుగా వస్తానని ఫోన్ చేశారు, ఏదో ఆఫీసు పనుందిట"


ఇంతకీ ఆ వచ్చిన కుర్రాడిలా అన్నాడు.

"మాధవిగారు ఎంత ప్రయత్నించినా మా బొమ్మల కొలువులో పార్కూ రోడ్లూ అవీ మీరు పెట్టినట్టు రాలేదండి.. మరి కిందటేడు మీరేం చేశారో సరిగ్గా అలాగే వస్తేగానీ భోంచెయ్యనని మా చిట్టి ఒకటే పేచీ. మిమ్మల్ని తీసికెళదామనే రానూ పోనూ ఆటో బేరమాడి తీసుకొచ్చాను. రాత్రయిపోయిందని సందేహించకండి. ఇంకా ఎనిమిదిన్నరే కదా అయింది. ఒక్కసారి వచ్చి బొమ్మల్ని ఎడ్జెస్ట్ చేసి వెళిపోదురుగాని. రేపు ఉదయం మంచిదట. బొమ్మలకి హారతి ఇచ్చేయాలట. ఓసారి పెట్టిన బొమ్మల్ని మళ్ళీ అటూ ఇటూ మార్చరకూడదట. రజనిగారూ, మీరు రాక తప్పదు. అసలు మా అమ్మే బయలుదేరుతానంది. నేనే తీసుకొస్తానని అడ్డుపడ్డాను. మీరు బయల్దేరండి. ప్లీజ్ మళ్ళీ నేనే దిగబెట్టేస్తానుగా!"

ఆ కుర్రాడంతగా కాళ్ళావేళ్ళా పడుతూంటే కాదనలేకపోయింది రజని. మొహం కడుక్కుని, చీర మార్చుకుని బయల్దేరింది. గంపెడు దుఃఖం మనసులో దాచుకున్నా.

మాధవి కడుపు నిండుగా ఉంది పిన్నీ వాళ్ళింట్లో పెట్టిన టిఫిన్‌తో. వీధి తలుపు గడియ వేసి వచ్చి, ఇన్ని మంచినీళ్ళు తాగి, ఏమీ తోచక టీవీ ఆన్ చేద్దామనుకుంటుంటే మాధవి దృష్టి అప్రయత్నంగా తాళం వేసి ఉన్న అన్నయ్య టేబిల్ డ్రాయర్ మీద పడింది. ఆ టేబిల్ మీద తక్కిన వాటితోపాటు పేపర్లూ పత్రికలూ పెడతారు. ఎప్పుడూ లేంది ఈ తాళం ఏమిటా అని మాధవి ఆశ్చర్యపోయింది. పక్కనే చిన్న మేకుకి తగిలించి ఉన్న 'కీ' నీకా సందేహం దేనికీ? తీసి చూడరాదో? అనిపించింది. 'ఏదో నాలుగు రోజులుండి వెళ్ళిపోయేదాన్ని ఇది నా ఇల్లు కాదు కదా! మొగుడూ పెళ్ళాల మధ్య ఏం రహస్యాలుంటాయో ఏమో!' అనుకున్నా అలా ఊరుకోలేకపోయింది. అన్నయ్య ఇప్పట్లో రాడు. వదినను వాళ్ళు ఇప్పట్లో వదలరు. తనకు అనుభవం అయిందిగా! పోనీ తీసి అదేదో చూసి ఎలా ఉన్నది అలా తాళం వేసి పెట్టేస్తేనేం!' అనిపించి, అలాగే చేసింది.

సొరుగును లాగింది. లోపలున్న సరుకుని ఇవతలికి లాగింది. చేత్తో పట్టుకుని



చూడ్డమేకాదు, పమిట చెంగును భుజం చుట్టూ కప్పుకుని అద్దం ముందు నిలబడి చూసుకుంది. పాము కుబుసల లాంటి ఆ చీరను సరిగ్గా మడతపెట్టడానికి ముచ్చెమటలు పోశాయి ఆమెకి. అతికష్టం మీద ఆ పని పూర్తిచేసి సొరుగులో పెట్టేసి యథాప్రకారం తాళం వేసేసింది. పరిపరి విధాలా ఆలోచనల్తో ఇవతలి గదిలో పడక్కుర్చీలో కూలబడింది. సంక్రాంతి పండుగకని అన్నయ్య వదినకి చీర తెచ్చి ఉంటాడు. దానికేం సందేహం లేదు. కానీ తన ముందు ఇద్దరూ కలిసి ఇంత దాపరికమూ, ఇలాంటి నాటకమూ దేనికి?

వదిన అంతో ఇంతో ఉన్న ఇంట్లోంచి వచ్చింది. వాళ్ళ నాన్న ఆవిడ పేర ఒక ఎకరం రాసిచ్చారు కూడా. తన బతుకెప్పుడూ బీద బతుకే. ఏదో తగుమాత్రం కట్నం ఇచ్చి ఓ గుమాస్తాగాడికి కట్టబెట్టారు తనని. ఈ లోకంలో డబ్బున్నవాళ్ళకే అన్ని ఖరీదైన వస్తువులూ అమరుతాయి. కళ్ళు జిగేలుమనే వదిన చీర చూసి ఇప్పుడు తన మనసు దిగాలుపడితే ఏం లాభం. తక్కువ నోములు నోచుకున్నవాళ్ళకి ఎక్కువ వరాలు రమ్మంటే వస్తాయా!

ఏదో పెద్ద స్నేహితురాల్లా వదిన కబుర్లు చెబుతుంది. 'ఇదిగో ఈ పండుక్కి నేనీ పెద్ద చీర కొనుక్కున్నా'నని చెబితే తనేం ఎత్తుకుపోతుందని భయమా, దిష్టి కొట్టి చిరిగిపోతుందనా!

పోనీ వదినయితే పైది. రక్త సంబంధం లేనిది. ఈ అన్నయ్యకొచ్చిన పోయేకాలమేమిటట! 'ధరలు బాగా పెరిగిపోయి, ఖర్చులకి తట్టుకోలేక ఈ సారి తృప్తిగా నీకు పసుపూ కుంకానికిగాను ఏమీ ఇవ్వలేకపోతున్నానే చెల్లీ! వచ్చే ఏడాది బోనస్ వస్తుంది గనక అప్పుడు ఇస్తాను. ఈసారికి నన్ను క్షమించి ఈ వందా తీసుకో.. జాకెట్టు గుడ్డయినా వస్తుందో రాదో.. ఏం చెయ్యను!'

అంటూ ఆ ఉదయమే కదా తన చేతిలో పచ్చనోటు నొక్కింది. సినిమాకి ఖర్చయిపో యిందిగానీ ఇంతటి దొంగపీనుగ అని తెలుసుంటే అప్పుడే ఆ నోటుని ఇంతింత ముక్కలు చేసి వాడి మొహాన్నే ఎగరేసి ఉండేదాన్ని కదా! అవును మరి.. పెళ్ళామయితే బెల్లం ముక్క, చెల్లెలయితే చీపురుకట్ట!

ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి ఎప్పుడు కునుకు పట్టిందో తెలీదు. మళ్ళీ రజని కాలింగ్ బెల్ చప్పుడుతోనే లేచి తలుపు తియ్యడం 'అన్నీ సరిగ్గా అమర్చి వచ్చావా వదినా!' అని ఎప్పట్లా అడగలేదు మాధవి. 'అదేం, నీ మొహం బొత్తిగా అలా వాడిపోయిందే' అని రజనీ అడగలేదు. 'ఇన్నాళ్ళూ తప్పుడు అంచనాలు వేసుకున్నది చాలు. ఈ మనిషిలో ఇంత కల్మషం ఉందని నెప్పుడూ అనుకోలేదు. ఈ మొహం చూడాలంటేనే ఎక్కడ లేని వెలపరమూ కలుగుతోంది' అని ఎవరిమట్టుకు వారు అనుకుని తమతమ గదుల్లోకి తప్పుకున్నారు.

## అభయహస్తం



జగత్తందరిని సృష్టించిన
శ్రీహరి చేయి,
ఏడు కొండలపైన వెలసినా
చేయి
తాటకద్రుంచిన చేయి,
తపసి యాగము గాచిన
చేయి
రాతినాతిగా జేసిన ధన్యమైన చేయి
శివ ధనుస్సు ద్రుంచిన శృంగారమైన చేయీ
సీతను పెళ్ళాడిన శ్రీకరమైన చేయీ
భార్గవరాముని విల్లు చేపట్టిన చేయీ
రాజ్యమ్ము మేలిన దశరథరాముని చేయీ

**- కోట అమ్మణ్ణమ్మ**

అనుకున్న అవమానం దహించివేస్తున్నా ఆకలికి అతీతులు కాదుగనుక అంతో ఇంతో యథాశక్తి కక్కుర్తిపడి ఉందురుగానీ, పిన్నిగారు పెట్టిన ఫలహారం ఆ అవసరం లేకుండా కాపాడింది.

ఇంకో గంటకి రెండు పాకెట్లతో ఇల్లు చేరిన శంకరానికి మాత్రం తనతో కలిసి తినడానికి వాళ్ళలా వెయిట్ చెయ్యడం కొత్తేమీ కాదుగానీ టివీ సీరియల్ వినిపించకపోడం గొప్ప ఆశ్చర్యమనిపించింది. ఇద్దరి మొహాలూ ఎప్పుడూ లేనంతగా వాడిపోయి ఎడమొహం పెడమొహంగా ఉండడం గమనించి మస్తుగా విస్తుపోయాడు.

పొద్దుటే వెళ్ళే ముందు చెల్లి చేతిలో ఓ వంద పెట్టేడుగాని అతని మనసేం బాగులేదు. అదీగాక పెళ్ళానికి కూడా పండుక్కి ఓమోస్తరు చీరయినా కావాలిగా.. మధ్యాహ్నం ఇంటికొచ్చి వెళ్ళేక ఆఖరుసారి అప్పుకి ట్రై చేశాడు. అనుకోకుండా ఓ వెయ్యి రూపాయిలు చేతిలో పడ్డాయి. ఇద్దరికీ నచ్చే రంగు లేత నీలం అని అతనికి తెలుసు. మేచింగ్ బ్లౌజ్ పీసెస్‌తో సహా ఒకే బొర్డరువి, చుక్కలు గలవి ఎంచేసరికి అతని దుంప తెగింది. అయినా వెయ్యిలోనే ఇమడడం ఎక్కళ్ళేని తృప్తినీ ఇచ్చింది. పేకెట్లు అందుకుని విప్పుకున్నారుగానీ అనుకున్నట్టు వారి మొహాలు విచ్చుకోకపోడం అతన్ని పిచ్చివాణ్ణి చేసింది.

"మరి తమరు మీ చెల్లాయికి తెచ్చిన ఆ హైక్లాసు చీర మాటేమిటో!" అని రజని విసరుతో పాటు -

"నా బతుక్కు వందే ఎక్కువరా అన్నయ్యా. పాపం మనసు ఎంతగా ఉగ్గబెట్టుకుని అంత గొప్ప దానం చేశావో. నన్నూ వదిననీ ఒకే దృష్టితో చూస్తున్నట్టు ఈ ఒకేరకం చీరలు కూడా ఎందుకూ పైపై నాటకాలు కాకపోతే. నేనెక్కడ చూసి అలాంటిది కావాలంటానో అని వేలకి వేలు ఖరీదైన చీర తెచ్చి నీ గది డ్రాయర్లో పెట్టి తాళం వేసుకున్నావుగా. దాన్తోపాటు ఈ రెండూ వదినకే ఇచ్చెయ్యి, నాకేం అక్కర్లేదు". అప్పటికిగాని జరిగిందేమిటో శంకరానికి బోధపడలేదు. తెలిశాక నవ్వాగలేదు. వాళ్ళిద్దర్నీ కూచోబెట్టి అది బోధపరిచి వాళ్ళనీ నవ్విస్తేగాని అతని మనసు కుదుటపళ్ళేదు.

ఇంతకీ జరిగిందిదీ...

శంకరం మధ్యాహ్నం ఇంటికి భోజనానికి వచ్చినప్పుడు ఏవో ఫైల్సు ఇవ్వవలసి వచ్చి మేనేజరుగారింటికి వెళ్ళేట్ట. ఆ వేళకి 'ఆ పెద్ద చీర' వాళ్ళ టేబిలు మీద ఉందిట. మేనేజరుగారి భార్య మీనాక్షమ్మగార్ని, శంకరంకి ఎప్పట్నుంచో తెలుసు. "చూడు శంకరం దీనికి "ఫాల్సు' కుట్టించి పెట్టాలయ్యా! మీ మేనేజరుగారి సంగతి నీకు తెలుసు కదూ, ఇప్పుడిస్తే మళ్ళీ సంక్రాంతికి చీర చేతికొస్తే అదృష్టవంతులమే - నీకు తెలిసిన టైలరు ఎవరైనా నాలుగైదు రోజుల్లో.."

ఆ మాత్రం ఉపకారం చెయ్యడానికి శంకరం సిద్ధమే. ఆ బాధ్యత వహించి చీర తెచ్చి ఇంట్లో డ్రాయర్లో పెట్టాడు. ఖరీదైన చీరకదా అని తాళం వేశాడు.

అవన్నీ నవ్వుతూ చెప్పి "మరీ ఇంత పి.ఎమ్. కూతుళ్ళను కోలేదు. ఇలాంటి చచ్చు ఊహ లకి మళ్ళీ తలపడ్డారో తెలిసిన షాపే కనక చీరలు వాపసు ఇచ్చేసి, నాకు నచ్చిన కలర్లో మంచి పాంటు కొనుక్కుంటాను. 'బీ కేర్‌ఫుల్!" అనే వెర్రి హెచ్చరిక ఒకటి చేసి, వాటర్ ఫాల్సు ప్రమాదం తప్పించి ఫుల్ మీల్సు వైపు పరిగెత్తించాడు. ✩

